# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 172 శనివారం | 06 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## బాలికల సాధికారతే లక్ష్యం

సేవా భారతి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

ఫిబ్రవరి 11న రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్




8లో



# దయన్నకు దడదడ

- రాజకీయ భవితవ్యంపై నీలినీడలు
- ఎర్రబెల్లిపై కసితో రగిలిపోతున్న రేవంత్ రెడ్డి
- కొండా దంపతులతో కొనసాగుతున్న వార్
- సొంత పార్టీ నేతలతోనూ చిటపట
- ఏమాత్రం రాజకీయ అనుభవం లేని యువతి చేతిలో చిత్తు
- ఓటమితో కుంగిపోతున్న మాజీ మంత్రి

ఆయన సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేత.. వ్యూహ, ప్రతి వ్యూహాల్లో దిట్ట.. ఓటమెరుగని నేత.. ఆర్థిక, అర్థ బలం ఆయనకు కొండంత అండ.. విలక్షణమైన వ్యక్తిత్వం ఆయన సొంతం.. ఆరుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా గెలిచి తనకు ఎవరూ సాటిలేరని నిరూపించుకున్న జనహృదయాకరుడు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఇంతటి మహెూన్నత వ్యక్తికి ఆపదొచ్చింది. ఆయన రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఓటుకు నోటు కేసులో తనను ఎర్రబెల్లి ఇరికించారన్న కోపంతో సీఎం రేవంత్ రెడ్డి రగిలిపోతున్నారు. ఎన్నికల ప్రచారంలోనూ ఆయనపై నిప్పులు చెరిగారు. ఇప్పుడు పవర్‌లోకి రావడంతోపాటు ఏకంగా ముఖ్యమంత్రి సీటులోనే రేవంత్ ఆశీనులయ్యారు. దీంతో దయాకర్ రావుపై ఎలాంటి ప్రతీకార చర్యలు ఉంటాయోనన్న ప్రచారం సాగుతోంది. అదే జరిగితే ఆయనను నమ్ముకున్న అనుచరులు ఎర్రబెల్లితో కలిసి పయనిస్తారా..? లేదంటే కాంగ్రెస్ వైపు చూస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

- వరంగల్ వాయిస్ ప్రత్యేక ప్రతినిధి

వివరాలు 2లో..



8లో..

## మాది గడీల పాలన కాదు.. గల్లీ బిడ్డల పాలన

- ప్రజా పాలనలో తీసుకున్న ప్రతీ దరఖాస్తు డేటా ఎంట్రీ చేస్తాం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



2లో

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

మంత్రి కొండా సురేఖ



8లో

## అంకితభావంతో పనిచేయాలి

- కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్
- వేడుకగా ఆర్టీసీ వనభోజనాలు

# దయన్నకు దడదడ



- రాజకీయ భవితవ్యంపై నీలినీడలు
- ఎర్రబెల్లిపై కసితో రగిలిపోతున్న రేవంత్ రెడ్డి
- కొండా దంపతులతో కొనసాగుతున్న వార్
- సొంత పార్టీ నేతలతోనూ చిటపట
- ఏమాత్రం రాజకీయ అనుభవం లేని యువతి చేతిలో చిత్తు
- ఓటమితో కుంగిపోతున్న మాజీ మంత్రి

**వరంగల్ వాయిస్ ప్రత్యేక ప్రతినిధి :** రాజకీయ ఉద్దండుడిగా పేరు గడించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పాలకుర్తి నియోజకవర్గంలో ఎలాంటి రాజకీయ అనుభవం లేని యువతి చేతిలో ఓటమిపాలు కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఆయనకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దీనికితోడు ఓటుకు నోటు కేసులో ఎర్రబెల్లి దయాకర్ రావు తనను ఇరికించారన్న కోపంతో సీఎం రేవంత్ రెడ్డి రగిలిపోతున్నారు. ఎన్నికల ప్రచారంలోనూ ఎర్రబెల్లిని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. కోర్టు పనిచేసిన దయాకర్ రావు అడ్రస్ గల్లంతు చేస్తానని వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని యువతిని పోటీకి నిలిపి అన్నంత పని చేశాడు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. ఓటమిపాలైన దయాకర్‌రావు ఇంటికి పరిమితమయ్యారు. అయితే మాజీ మంత్రి పరిస్థితి ఏంటి అనేది సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. అంతేకాకుండా, ఆయనను నమ్ముకున్న అనుచరులు ఎర్రబెల్లితో కలిసి పయనం చేస్తారా..? లేదంటే కాంగ్రెస్ వైపు చూస్తారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది.



### కొండాతో వార్..

కొండా దంపతులతో ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆది నుంచే రాజకీయ వైరం ఉంది. మొదటినుంచి వారు ఉప్పు నిప్పులాగే ఉండేవారు. కొండా, ఎర్రబెల్లి ఒకరిపై ఒకరు హత్యాయత్నానికి కూడా ప్రణాళికలు రచించుకున్నారని ప్రచారంలో ఉంది. గతంలో తెలుగు దేశం అధికారంలో ఉన్నప్పుడు దయాకర్‌రావు తన పలుకుబడితో కొండా దంపతులను ముప్పు తిప్పలు పెట్టగా తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దయాకర్‌రావు టార్గెట్‌గా పనిచేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటు కొండా దంపతులు, అటు దయాకర్‌రావు ఆ పార్టీలో చేరి ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. అయితే, ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడ లేవు అన్నట్లుగా కొండా దంపతులు తిగిరి సొంత గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన కొండా సురేఖ గత ఎన్నికల్లో పర్కాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికలో దయాకర్‌రావు పాలకుర్తి నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రి అయ్యారు. దీంతో మళ్లీ కొండా దంపతులే టార్గెట్‌గా ఎర్రబెల్లి పనిచేశారు. ఇప్పుడు దయాకర్ రావు పాలకుర్తిలో ఓడిపోయారు. కొండా సురేఖ వరంగల్ తూర్పు నుంచి గెలిచి మంత్రి అయ్యారు. మరి కొండా దంపతులు తమ అగర్భ శ్రతువు దయాకర్‌రావును టార్గెట్ చేస్తారా.. లేదా వదిలేస్తారా చూడాలి..? జిల్లాలో కొండా వ్యూహాన్ని దయాకర్‌రావు ఎలా చేధిస్తారో వేచి చూడాల్సిందే..

### యువతి చేతిలో పరాభవం..

పాలకుర్తి.. పోరాటల పురిటిగడ్డ.. నిజాం ఆరాచకాలపై ఎదురొడ్డి పోరాడిన చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ.. అదే స్ఫూర్తితో 26 ఏళ్ల యువతి మామిడాల యశస్వినిరెడ్డి 46 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నేత ఎర్రబెల్లి దయాకర్ రావును మట్టికరిపించారు. ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుంచి 40 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలిచి ఎర్రబెల్లి సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టింది. మంత్రిగా ఉన్నప్పుడు దయాకర్‌రావు ఆయన అనుచరుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. కాంగ్రెస్ నేతలను టార్గెట్ చేస్తూ అనేక కేసుల్లో ఇరికించారు. వారిని ముప్పు తిప్పలు పెట్టారు. నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ వారికి అండగా నిలిచే పెద్ద దిక్కు లేకుండా పోయింది. ఈ సమయంలో కార్యకర్తలకు ఆక్సిజన్‌లా మారారు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి. ఈమె అమెరికాలో స్థిరపడినప్పటికీ సొంతగడ్డకు ఎప్పటి నుంచో సేవ చేస్తున్నారు. అయితే, ఈ సారి ఎన్నికల బరిలో నిలవాలని నియోజకవర్గంలో విస్తృతంగా తిరిగారు. కేవలం 26 రోజుల ముందే నియోజకవర్గంలో కాలుమోపి ప్రజాదరణ పొందారు. అయితే, ఓడిపోతానని ఊహించని దయాకర్ రావు ఝాన్సీరెడ్డి పౌరసత్వం సాకుతో కాంగ్రెస్ నుంచి టిక్కెట్ దక్కకుండా చేశారు. దీంతో ఝాన్సీరెడ్డి ఆమె కొడలు మామిడాల యశస్వినిరెడ్డిని బరిలో దించారు. ఎన్నికల సమయంలో అత్తాకొడలుపై ఎర్రబెల్లి అనేక ఆరోపణలు చేశారు. తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఎన్నికల ముందు రోజు వారిని స్థానికంగా లేకుండా చేయాలని పోలీసులతో వారిని తొర్రూరు నుంచి బయటకు వెళ్లగొట్టాలని ప్రయత్నం చేశారు. ఇద్దరు మహిళలు రోడ్డుపైకి వచ్చి దయాకర్ రావు ఆరాచకాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల్లో సానుభూతి రావడంతో పాటు భారీ మెజార్టీతో యశస్వినిరెడ్డి గెలిచారు. ఆమె ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే, ఇన్ని రోజులు తమ కార్యకర్తలను, తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన మాజీ మంత్రి దయాకర్‌రావును, బీఆర్ఎస్ నాయకులను వదిలేస్తారా..? లేదంటే వారిని టార్గెట్ చేస్తారా..? వారి దందాలను ఒక్కొక్కటిగా బయటకి తీస్తారా..? అనేది నియోజకవర్గంలో చర్చానీయాంశంగా మారింది.

### సొంత పార్టీ నేతలతో చిటపటలు..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రత్యర్థి పార్టీ నేతలతోనే కాదు.. సొంత పార్టీ నేతలతోనూ వైరం ఉంది. తాజాగా స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరికి.. దయాకర్‌రావుకు మధ్య ఎప్పటినుంచో చిటపటలు కొనసాగుతూనే ఉన్నాయి. వీరిద్దరు గతంలో తెలుగుదేశంలో పనిచేశారు. అప్పుడు శ్రీహరి మంత్రిగా, దయాకర్ రావు ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే వీరద్దరికీ అప్పటి నుంచి అభిప్రాయ బేధాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకరంటే ఒకరికి పడదు. ఇప్పుడు దయాకర్ రావు ఓడిపోయి శ్రీహరి విజయం సాధించడం ఆయనకు మింగుడు పడని అంశంగా మారింది. బీఆర్ఎస్‌లో కడియంకు ప్రాధాన్యం పెరగడంతో దయాకర్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారు. అదే విధంగా మంత్రిగా ఉన్నప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలను కూడా చిన్నచూపు చేసేవారని, లోపాయికారి నిర్ణయాలతో వారిని ఇబ్బందులకు గురి చేసేవారన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సొంత పార్టీ నేతలు కూడా మాజీ మంత్రిపై గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా : మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు, మాజీ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పిల్లి సాంబశివరావు, బత్తిని సుదర్శన్ గౌడ్, స్టేట్ ప్రెసిడెంట్ టీజీపీఏ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఐఎన్ టీయూసీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శనివారం మంత్రిని కలిసి శాలువా, బోకే లతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సీపీఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను అమలుచేయాలని, జీఓ నెం 317 ని వెంటనే రద్దుచేసి వారి సొంత జిల్లాలలో తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని, ఈ కుబేర్ ను వెంటనే రద్దు చేసి ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని, మెడికల్ డిపార్ట్ మెంట్ లో జీఓ 142ని రద్దు చేయాలని, ఉద్యోగుల ప్రమోషన్ లు చేపట్టాలని, అన్ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని, ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పు ప్రసాద్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మంచిక ప్రమోద్ కుమార్ గౌడ్, ఇంజినీర్స్ అసోసియేషన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు గులాం యజ్ దాని, సీహెచ్ ఓల సంఘం రాష్ట్ర నాయకులు ఓన పాకల రాజయ్య, కంద కట్ల శరత్ బాబు, టీజీపీఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐఎన్టీయూసీ వరంగల్ జిల్లా సెక్రటరీ గుగులోత్ వీరేందర్ నాయక్, పి.ప్రసాద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్స్, కె.వేణుగోపాల్, వి.సమ్మయ్య, బూర నారాయణ, రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ నాయకులు గోగు మల్లయ్య, భూక్య శివాజీ, సతీష్, ఈఎస్ ఐ హాస్పిటల్ రాష్ట్ర నాయకులు వి.శ్రీనివాస్, మధు, ఎన్ హెచ్ ఎం స్టేట్ నాయకులు సుదర్శన్, హెల్త్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ స్టేట్ నాయకులు తిరుపతయ్య, ఐఎన్ టీయూసీ నాయకురాలు భాగ్యలక్ష్మి, ప్రేమలత, నర్సమ్మ, శైలజ, రాజ్యలక్ష్మి, ప్రసూన శ్రీ, ముత్తి లింగం, ఫ్రార్మసిస్ట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ డి.ప్రకాష్ రావు, ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు సంబు నాయక్, లావుడ్య పుల్య, ఇతర అన్ని విభాగాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### గోదాదేవి తిరు కళ్యాణానికి రండి..

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** చరిత్రకు నిలయమైన వరంగల్ నగరం నడి మధ్యన గోవిందాది కొండపై స్వయంభుగా వెలసిన శ్రీదేవి భూదేవి నీలాదేవి సతీ సమీతునైన శ్రీ గోవిందరాజ స్వామి దేవస్థానంలో ధర్మాస ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఈనెల 14న నిర్వహించే శ్రీ గోదాదేవి తిరు కళ్యాణ మహోత్సవానికి రావాల్సిందిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను దేవాలయ అర్చకులు కోరారు. శనివారం నగరంలో మంత్రి సురేఖతో కలిసి కళ్యాణ మహోత్సవ గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి, ఆలయ అర్చకులతో పాటు పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ పాల్గొన్నారు.

## బావిలో దూకి యువతి ఆత్మహత్య

**వరంగల్ వాయిస్, మరిపెడ :** ప్రియుడితో ఏర్పడిన మనస్పర్థల కారణంగా మనస్తాపం చెంది యువతి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని మూలమర్రితండాలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మూలమర్రితండా పరిధిలోని తోప్ల తండాకు చెందిన బానోత్ శ్రీను రెండో కుమార్తె బానోత్ చామంతి(21) తానంచర్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివి అనంతరం ఇంటివద్దే ఉంటోంది. అయితే ఆమెకు మూడేళ్ల క్రితం వాల్యతండాకు చెందిన తేజావత్ వాసు అనే యువకుడితో పరిచయం ప్రేమగా మారింది. ఏడాది క్రితం వాసుకి చామంతికి మనస్పర్థలు రావటంతో అప్పుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, ప్రియుడు సొంత ఖర్చులతో వైద్యం చేయించాడు. అనంతరం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి ఇరువర్గాలను సముదాయించారు. అప్పటి నుంచి దూరంగా ఉంటున్న ఇద్దరు మళ్లీ కొంత కాలంగా మాట్లాడుకుంటున్నారని, ఈ క్రమంలోనే చామంతి ప్రియుడు వాసుకు ఫోన్ చేసి చనిపోతున్నానని చెప్పి బావిలో దూకిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. కాగా యువతి 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం తానంచర్ల పరిధిలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జాతీయ స్థాయిలో రామప్ప విద్యార్థి ప్రతిభ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత నెల 9న 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, అండర్ 19 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ (హైజంప్)లో రామప్ప కళాశాల విద్యార్థిని శ్లేషస్మిత వర్మ అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఆ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడమే కాక, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 25 నుంచి 27 వరకు మహారాష్ట్ర బల్లార్పుర్ లో జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అథ్లెటిక్ విభాగంలో అంచెలంచెలు గా ఎదుగుతూ అటు క్రీడా రంగానికి, ఇటు కళాశాలకు పేరు తెస్తున్న శ్లేషస్మితవర్మను రామప్ప జూనియర్ కళాశాల డైరెక్టర్ ఐలి కర్ణాకర్ గౌడ్, అలాగే కోచ్ లు, తాబేటి సతీష్ కుమార్, కళాశాల ఫిజికల్ కోచ్ కమల్, కళాశాల అధ్యాపక బృందాన్ని అభినందించారు.

## సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలోని గెస్ట్ హౌస్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సింగరేణి చైర్మన్ సీఎండీగా ఎన్.బలరాం నాయక్ కు బాధ్యతలు అప్పగించినందుకు, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ సహకారంతో ఒక గిరిజన బిడ్డను సీఎండీగా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నెల్లికుదురు కాంగ్రెస్ పార్టీ పక్షాన పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ అధ్యక్షుడు కుమ్మరి కుంట్ల మౌనేందర్, కిసాన్ మండల అధ్యక్షుడు సలుగు పూర్వచందర్, మండల కార్యదర్శి హెచ్ మల్లేష్, కిసాన్ ఉపాధ్యక్షుడు జగ్జీవన్, గ్రామ ఉపాధ్యక్షుడు ఆకుల కొమురెల్లి, మండల నాయకులు ఆకుల నరసయ్య, మామిడాల లోకేష్, రత్నపురం వెంకన్న, గుగులోతు భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో చల్లా



**వరంగల్ వాయిస్, పరకాల :** ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామంలో శ్రీ పరమేశ్వర దివ్య శివలింగ సహిత గణపతి గ్రామదేవత యంత్ర, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. గ్రామానికి వచ్చిన చల్లా ధర్మారెడ్డికి వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి అశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన గడువు పెంచాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా పాలన గడువు పెంచాలని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కల్లూరి పవన్ అన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ చాలా మంది ప్రజా పాలన వివిధ కారుణలతో దరఖాస్తు చేసుకోకపోవడంతో ప్రజలు సంక్షేమ పథకాలు పొందలేరని అన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రజాపాలన గడువును మరి కొన్ని రోజులలో పెంచాలని కోరారు.

# క్రిష్ణయ్యను ఉద్యోగం నుంచి తొలగించాలి

### కేయూలో అవినీతిపై న్యాయ విచారణ జరిపించాలి
### విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ లో హాస్టల్ ఆఫీస్ లో రూ. 9 లక్షల పాల బిల్లులు చెల్లించడానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య రూ.50వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు రెడ్ హ్యాండెడ్ గా దొరికిన ఆర్.క్రిష్ణయ్యను ఉద్యోగం నుంచి తొలగించాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) ఐక్య విధ్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), అంబేద్కర్ విద్యార్థి సమైక్య, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టి అనంతరం వీసీ బిల్డింగ్ ముట్టడించారు. ఛాంబర్ లోపల బైఠాయించి నిరసన వ్యక్తం చేసి పెద్దఎత్తున నినాదాలు చేశారు. యూనివర్సిటీ అధికారులు విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన డబ్బులను యూనివర్సిటీ అధికారి లంచం రూపంగా తీసుకోవడం సిగ్గు మాలిన చర్యని అన్నారు. యూనివర్సిటీలో కోట్ల అవినీతి జరుగుతుందని, న్యాక్ పనుల్లో 10 కోట్ల అవినీతి జరిగిందని వాటిపై ఛాన్సలర్, తమిళ సై సౌందర రాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూనివర్సిటీలో జరిగిన పనులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని వారు కోరారు. యూనివర్సిటీలో లంచం తీసుకోవడం సిగ్గు చేటని, దుర్మార్గపు చర్య అని వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్నారు. ఆయన వెనుక ఉన్న అసలు దొంగలను బయటకు తీయాలని వారు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూకబ్జాదారులను కూడా బయటకు తీయాలని, హాస్టల్, ఆఫీసులో జరిగిన రెండు కోట్ల అవినీతిపై, సుబేదారి లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన రూ. 3కోట్ల అవినీతిపై సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావులను రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ లు స్పందించి వారిని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కేయూ ఇంచార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మందా శ్రీకాంత్, ఏబీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్ కళ్యాణ్, బీసీ విద్యార్థి సంఘం యూనివర్సిటీ అధ్యక్షుడు సుధగాని మధు, విద్యార్థి సంఘాల నాయకులు స్టాలిన్, మందా కార్తీక్, శర్వాణి, రోషిణి, జ్యోత్స్న, పూజ, నాగార్జున, రాము, మరో 50మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాటారం డీఎస్పీ రామ్ మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కొయ్యూరులో శనివారం విద్యార్థులు, యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసై తమ విలువైన భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దన్నారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ రంజిత్ రావు, కొయ్యూరు ఎస్సై నరేష్, ఏ ఎస్సై కుమార స్వామి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ఉద్యమకారుడు మరుపల్లి రవి దరఖాస్తు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వపరంగా 250 గజాల ఇంటి స్థలం కోసం ఆరు గ్యారెంటీల హామీలో పేర్కొన్నందున వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి శనివారం ఉర్సు సీఆర్ సీ భవన్ లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన కార్యక్రమంలో ఇంచార్జ్ రాజ్ కుమార్ కు ప్రజాపాలన దరఖాస్తును అందజేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం నాటి ఉద్యమనేత కేసీఆర్ ను అల్గునూరులో నాటి ప్రభుత్వం అకారణంగా అరెస్ట్ చేసినందుకు మురుపల్ల రవి ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో బస్సు అద్దాలు పగలగొట్టారు. దీంతో అప్పటి ఇంతేజార్ గంజ్ ఎస్సై దేవేందర్ రెడ్డి అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ కేస్ 280/2009 కోర్టుకు పంపగా అప్పటి జడ్జి 14రోజులు రిమాండ్ విధించగా తనతో పాటు 14మందిని వరంగల్ సెంట్రల్ జైల్ కు తరలించారు. ఈ క్రమంలో రెండు రోజులు జైల్లో ఉన్నామని, ఆ తర్వాత బెయిల్ పై విడుదల అయినట్లు ఆ దరఖాస్తులో పేర్కొన్నారు

# కూరగాయ రైతులకు రవాణా కష్టాలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** నిత్యం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని కూరగాయలు సాగు చేసే రైతులు సరైన మార్కెట్, రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని కుంభంపల్లి, కొండంపేట్, వల్లెం కుంట గ్రామాలకు చెందిన రైతులు గత కొన్ని సంవత్సరాలుగా కూరగాయలు సాగు చేసి జీవనోపాధి పొందుతున్నారు. ముఖ్యంగా వంకాయ, అలిశంత, బెండ, బోడ కాకర, దొండ, చిక్కుడు వంటి కూరగాయలు వీరు పండిస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, చీడ పీడలు రాకుండా తగు చర్యలు తీసుకొని కూరగాయలు పండిస్తున్న వీరికి సరైన మార్కెట్, రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరు పండించిన కూరగాయలు పట్టణ ప్రాంతాలైన మంథని, భూపాలపల్లి, గోదావరి ఖని వంటి ప్రాంతాలకు సరఫరా అవుతుంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూరగాయలు తెంపిన రైతులు మరునాడు ఉదయం వాటిని మార్కెట్ కు తరలించడం వీరికి తలకు మించిన భారమవుతుంది. కుంభంపల్లి, వల్లెంకుంట గ్రామాల రైతులు కూరగాయలను మార్కెట్ కు తరలించాలంటే కొయ్యూరు వరకు బైక్ లపై వెళ్లి అక్కడి నుంచి ఆర్టీసి బస్సులు లేదా ప్రైవేట్ వాహనాల ద్వారా పట్టణాలకు తరలించాలి. ఆర్టీసి బస్సులు సమయానికి రాక పోవడం ఒకవేళ వచ్చిన కొందరు ఆర్టీసి సిబ్బంది కూరగాయల బస్తాలు తీసుకెళ్లడానికి అంగీకరించక పోవడంతో గత్యంతరం లేక అధిక ధర చెల్లించి ప్రైవేట్ వాహనాల ద్వారా పట్టణాలకు చేరవేస్తున్నారు. సరైన రవాణా సౌకర్యం లేక సకాలంలో మార్కెట్ కు చేరుకోక పోవడంతో మద్దతు ధర లభించక తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రవాణా కష్టాలు తీర్చాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాపాలన నిరంతర ప్రక్రియ

## లబ్ధిదారులు ఎవరూ అపోహలకు గురి కావొద్దు
## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని హౌజ్ బుజుర్గు, కామారం గ్రామాలలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన చివర రోజు సందర్భంగా జరిగిన గ్రామసభలలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో ప్రజాపాలన లబ్ధిదారులకు దరఖాస్తులు అందజేస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గా గెలిచి మొదటి సారిగా గ్రామాలకు వచ్చిన రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్ప గుచ్చాలు అందించి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చిందని, ఆరు గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సభలో దరఖాస్తులు సమర్పించలేని వారు చివరి రోజైన శనివారం వరకు తమ దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపజేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, పథకాల అమలుపై ప్రతిపక్షాలు చెప్పే మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశామని, మిగతా పథకాలను ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులున్నా.. అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో పలు గ్రామాల సర్పంచులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఎస్సైను సస్పెండ్ చేసిన సీపీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓ వాహనదారుడి నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన హనుమకొండ ట్రాఫిక్ ఎస్సై డేవిడ్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల కిందట ములుగు రోడ్డు వద్ద ట్రాఫిక్ ఎస్సై డేవిడ్ ఓ వాహనదారుడి నుంచి లంచం తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వెంటనే ఆయనను హెడ్ క్వార్టర్స్‌కు తరలించి విచారణ చేపట్టారు. ట్రాఫిక్ ఎస్సై లంచం తీసుకున్నట్లు నిరూపణ కావడంతో సీపీ అంబర్ కిశోర్ ఝా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మొదటి నుంచి డేవిడ్ పనితీరుపై తీవ్ర విమర్శలు, ఆరోపణలు ఉన్నాయి.

## మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వీవీ ఫౌండేషన్ ప్రారంభోత్సవాన్ని శ్రీ చక్ర హాస్పిటల్ లో ఫౌండర్, ఛైర్మన్ అడ్వకేట్ కొత్తపెల్లి రాజు, హనుమకొండ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ న్యాయవాది డాక్టర్ చల్లా శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఫౌండేషన్ మొదటి కార్యక్రమంగా రక్తదాన శిబిర కార్యక్రమాన్ని డాక్టర్ వి ప్రసాద్, గోపీనాథ్ ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంమహాత్మా గాంధీ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఫౌండర్ ఛైర్మన్ మాట్లాడుతూ ఈ సమాజంలోని ప్రతి పౌరుడికి సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ పేదలకు సేవ చేసే దిశగా మన ఫౌండేషన్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిథిగా వచ్చిన న్యాయవాది డాక్టర్ చల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫౌండేషన్ మొదటి కార్యక్రమాన్ని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా గొప్ప పని అని, రక్త దానంతో మరొకరికి ప్రాణం పోయడమేనన్నారు. ప్రతి ఒక్క పౌరుడు సమాజంలో బాధ్యతగా ఉండాలని ఇలాంటి కార్యక్రమాలు పునాదిగా పుట్టిన వీవీ ఫౌండేషన్ కు ఎల్లవేళలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ మోటీవేటర్ రచ్చ కల్యాణి, ప్రముఖ న్యాయవాదులు దేవులపల్లి రాజేష్, మున్నారపు మహేష్, కందుకూరి మోహన్, గంధం రమేష్, వంశీ, పెండ్యాల అనిల్ కుమార్, వరిపల్లి నరేష్, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు దూడపక సురేష్, బొట్ల తేజ, ఠాగూర్, కలాం, దారవత్ సురేష్, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ దూడ ప్రశాంత్, జనరల్ సెక్రెటరీ దండెంపెల్లి సురేందర్, శ్రీ చక్ర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అనాథ బాలల పుట్టిన రోజు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** బాల వికాస సంస్థ ఆధర్వంలో అనాథ బాలల పుట్టిన రోజు వేడుకలను మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని బాల వికాస కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మరిపెడ మండల కోఆర్డినేటర్ ఉపేంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రతి సంవత్సరం మహిళల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి కొత్త బట్టలు ఇస్తున్నట్లు తెలిపారు. వారికి చదువు విలువ గురించి వివరించారు. బాల వికాస ఉమెన్ కో ఆర్డినేటర్ సరళ, అమూల్య, మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు సింధూర రవి, సూర్య తేజ ఏజెన్సీస్ ఉప్పల కృష్ణమూర్తి, మహాలక్ష్మి దంపతులు, దంతాలపల్లి కోఆర్డినేటర్ కందుకూరి సుకన్య, మార్గం శోభ, తొర్రూర్ మండల కోఆర్డినేటర్ కె.రమా, వర్ధన్నపేట మండల కోఆర్డినేటర్ రాణి, కోరుకొండ శ్రీదేవి, కందుకూరి వరలక్ష్మి, సహా కోఆర్డినేటర్స్ జుజూరి ఉపేంద్ర, దొనికేన ఉపేంద్ర, గ్రూప్ లీడర్స్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

**వరంగల్ వాయిస్, మడికొండ :** కాజీపేట మండలం 64వ డివిజన్ లోని మడికొండలో ప్రజా పాలన దరఖాస్తులను నోడల్ అధికారి డిప్యూటీ సిటీ ప్లానర్ ప్రకాష్ రెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ సురేందర్, డీహెచ్ఎంఓ ఆఫీసర్ బాబురావు, ట్రాన్స్ కో హనుమంత్, సివిల్ సప్లై సదానందం, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, కాంటేస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్, బిల్ కలెక్టర్ కృష్ణ, ఇన్ స్పెక్టర్ కోటి, మహిళా సంఘాల ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని గూనిపర్తి గ్రామంలో అయోధ్య శ్రీరామ మందిరం సీతారామస్వామి అక్షింతలను శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థాన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీహరి, చీకట్ల శ్రావణ్, ముడిద కృష్ణ, బుర్ర కరుణాకర్, వడ్డే కోటేశ్వర్, రాకేష్, రాజు దేశిని రజనీకాంత్, పల్లపు శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, తిరుపతి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ అధికారుల చేరిక సంఘానికి అదనపు బలం

### టీజీఓ అధ్యక్షుడు జగన్మోహన్ రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బల్దియా ఇంజినీరింగ్ అధికారుల చేరిక సంఘానికి అదనపు బలమని టీజీఓ అధ్యక్షుడు జగన్మోహన్ రావు అభిప్రాయ పడ్డారు. బల్దియాకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు ఉమ్మడి వరంగల్ జిల్లా టీ ఎస్ సీపీఎస్ ఈయూ డిపార్ట్ మెంట్ ఫోరం కన్వీనర్, బల్దియా ఏఈ దొడ్డిపాటి హరికుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ (టీజీఓ)లో చేరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గల టీజీఓ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు పాల్గొని మాట్లాడుతూ బల్దియా ఇంజినీరింగ్ కు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) టీజీఓలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వీరి చేరికతో సంఘానికి అదనపు బలం చేకూరిందని, ఇప్పటి వరకు టీజీఓ ఉద్యోగుల పక్షాన సమస్యల సాధనకు ఏవిధంగా ముందుకు వెళ్లామో, అదే పంథాను కొనసాగిస్తూ ఇంజినీరింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధ్యక్షుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బల్దియాకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు కార్తీక్ రెడ్డి, ప్రవల్లిక, మోజమిల్, సౌజన్య, రాగి శ్రీకాంత్, మేనక, అజ్మీరా శ్రీకాంత్, విజయ లక్ష్మి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీపీ డేవిడ్ రాజ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట పట్టణ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిరిల్ లారెన్స్, సిలువేరు విజయభాస్కర్, గోల్కొండ రాంబాబు, సల్లూరి నాగేశ్వర్రావు, మాతంగి స్వామి, పోగుల శ్రీనివాస్, కేతవత్ రాజులు శనివారం కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

## ప్రజాపాలనలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, ఐనవోలు :** మండల పరిధిలోని వనమాల కనపర్తి, పేరుమాండ్ల గూడెం గ్రామాలలో ప్రజాపాలన అభయ హస్తం గ్యారెంటీ దరఖాస్తుల స్వీకరణ ప్రజాపాలన కార్యక్రమాన్ని వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి వారికి అన్ని విధాలుగా ప్రజలకు సలహాలు, సూచనలు ఇస్తూ దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ప్రజలందరూ కంగారు పడొద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, అవసరం అయితే ఇంకా కొన్ని రోజులు పెంచుకుందామని వారు తెలియజేశారు. అనంతరం వనమాల కనపర్తి ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి పాఠశాల వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థి విద్యార్థినులకు బుక్స్, పెన్సిళ్లను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ శాఖ అధ్యక్షుడు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, స్పెషల్ ఆఫీసర్, ఎమ్మార్వో, ఏఈ, డీఈ, అంగన్వాడీ, ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, స్కూల్ హెడ్ మాస్టర్, టీచర్స్ తో నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ఆర్డీఎఫ్ రోల్లకల్ పాఠశాలను ఇన్ఫర్ డైరెక్టర్ లు సాయి రెడ్డి, కిరణ్ అడ్డాల, నేహా ఇన్ఫర్ పీఎంఓ టీం శనివారం సందర్శించారు. ఇన్ఫర్ సంస్థ వారు అందించిన నిధులతో ఏర్పాటుచేసిన స్టేజీ, టాయిలెట్ బ్లాక్‌ను వారు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాషబోయిన రాములు, కరస్పాండెంట్ అశోకచారి, కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాల అసిస్టెంట్ హెచ్‌ఎం మహేందర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు

## ప్రజా పాలనలో 9,107 దరఖాస్తులు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు మల్హర్ మండలంలో 9107దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీఓ నరసింహ మూర్తి తెలిపారు. గ్రామాల వారీగా మల్లం పల్లిలో 78, కొండంపేటలో 304, దుబ్బపేటలో 77, చిన్న తూండ్లలో 297, ఇప్పల పల్లెలో 232, అడ్వాల పల్లెలో 226, తాడిచెర్ల లో 2629, ఎడ్లపల్లిలో 443, కొయ్యూరులో 358, వల్లెంకుంటలో 696, పెద్ద తూండ్లలో 844, మల్లారంలో 1000, రుద్రారంలో 1107, నాచారంలో 389, అన్సాన్ పల్లిలో 427దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. శనివారంతో మొదటి విడత ప్రజా పాలన కార్యక్రమం ముగిసిందని, జనవరి 8 నుంచి 17 వరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేస్తామని వారు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డిది సుపరిపాలన

### కాంగ్రెస్ నేత శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శివనగర్‌లో ప్రజా పాలనను గత ఎనిమిది రోజులు దిగ్విజయంగా నిర్వహించిన మున్సిపల్ సిబ్బందికి, మహిళా సంఘాలకు కాంగ్రెస్ నేత శామంతుల శ్రీనివాస్ స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలన జరుగుతుందన్నారు. వరంగల్ జిల్లా మంత్రి కొండా సురేఖ మురళి ఆధ్వర్యంలో ప్రజాపాలన శాంతియుతంగా పరిపూర్తి జరిగిందని, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నేత విజయరాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'అద్దంకి' వివాహ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కలిసి శు భాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లో అద్దంకి దంపతులను శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుంగతుర్తి టికెట్ ను త్యాగం చేసి కాంగ్రెస్ పార్టీ ఔన్నత్యం కాపాడారన్నారు. అన్ని సామాజిక వర్గాలు అభ్యున్నతి కోరుకునే అద్దంకికి తెలంగాణ క్యాబినెట్ లో చోటు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. సిద్ధాంతాల కోసం పరితపించే నాయకుడని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు దోమ సతీష్, సీనియర్ జర్నలిస్టు యాడాల దేవేందర్, మాడుగుల నర్సింగం, అనకట్ల వినయ్, దోమ సాయిలు, సింగారపు రవి ప్రసాద్, అంకేశ్వరపు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని మర్రిపెల్లిగూడెం గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారి నరసింహారావు మాట్లాడుతూ మహిళల్లో పొదుపుల రుణాలు సకాలంలో చెల్లించాలని, పంట రుణాలు సంవత్సరంలోపు విధిగా రెన్యువల్ చేసుకోవాలని ప్రధానమంత్రి సంరక్ష యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన వంటి బీమా పథకాలను చేసుకోవాలన్నారు. ఏటీఎం వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం తదితర సౌకర్యం ద్వారా వినియోదారులు సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

### రెండు ఎంపీ సీట్లు మాదిగలకు ఇవ్వాలి

### మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాదిగ జేఏసీ –మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మైస ఉపేందర్ అధ్యక్షతన శనివారం హనుమకొండలోని టీఎన్జీవోస్ భవన్ లో మాదిగల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్ర చేస్తుంది, ఎస్సీ వర్గికరణ పేరుతో మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లను దండుకోవడానికి తెరలేపింది. మాదిగ, మాదిగ ఉపకులాల పట్ల బీజేపీ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదం తెలిపాలని రవి డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం మతం, కులాల పేరుతో దేశ ప్రజలను విభజించి, పాలిస్తుంది, దళితులు, గిరిజనుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తుందని ధ్వజ మెత్తారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళిత, గిరిజన ప్రజల పై దాడులు జరుగుతున్నాయని రవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలు అప్రమత్తంగా ఉండాలి, ఎస్సీ వర్గికరణ జనాభా దామాషా ప్రకారం జరగాలి, తెలంగాణలో మాదిగల జనాభా 12శాతం ఉంది, ఎస్సీ వర్గీకరణ జనాభా దామాషా ప్రకారం జరిగితేనే తెలంగాణలో అధిక జనాభా ఉన్న మాదిగలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో న్యాయం జరుగుతుందని రవి పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ కులాల జనాభా ప్రకారం వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి, ఆమోదం తెలిపి దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయా రాష్ట్రాల ఎస్సీ జనాభా ప్రకారం వర్గీకరణ అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు ఇవ్వాలని రవి కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలకు అన్ని రాజకీయ పక్షాలు రెండు సీట్లు కేటాయించాలని పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగల రాజకీయ అస్తిత్వం కోసం మాదిగ జేఏసీ, రాష్ట్రంలోని మాదిగ సంఘాలతో కలిసి పోరాడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వీరేందర్, రాయశెట్టి ఉపేందర్, బరిగల బాబు, కొడాలి దిరన్, మధుకర్, కిషోర్, నాగరాజు, కన్నం సునీల్, సురేష్, 100 పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్ హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నర్సింహ డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్‌ఎం) స్కీంలో గత 20ఏళ్లుగా దాదాపు 15 వేల మంది ఉద్యోగులు వివిధ కేటగిరిలో కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్నటువంటి ఈ స్కీంలో ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వాలు గతంలో తీవ్ర అన్యాయాన్ని చేశాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. నేడు హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్ హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వవలసి ఉన్నప్పటికీ దానిని గతంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా రాష్ట్రంలో ఉన్నటువంటి వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. భవిష్యత్తులో వీరికి 2016 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్ హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్ హెచ్‌ఎం కాంట్రాక్టు సిబ్బందికి జరిగిన అన్యాయంపై గతంలో అనేక పోరాటాలు నిర్వహించటం ద్వారా వారి సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ వేసి సమస్యలను పరిష్కరిస్తామని గతంలో ఉన్నటువంటి అధికారులు తెలియజేశారని అన్నారు. ప్రస్తుతం నూతనంగా వచ్చినటువంటి ఎన్ హెచ్‌ఎం స్కీం డైరెక్టర్ వారి సమస్యలపై దృష్టి సారించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి డి.బాపు యాదవ్ , రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎస్.వరలక్ష్మీ , హనుమకొండ జిల్లా ప్రెసిడెంట్ బత్తుల విష్ణుమూర్తి, మేడ్చల్ డిస్ట్రిక్ట్ వైస్ ప్రెసిడెంట్ సిద్దిపేట రాజేశ్వరి, రాష్ట్ర నాయకులు నరసింహ, సుమన్ ఎన్ హెచ్‌ఎం నాయకులు రేణుక, స్వరూప, సత్యనారాయణ, సంగీత, మధుసూదన్, ఉప్పలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ స్కీమ్ లను అమలుచేస్తామని వాగ్దానం చేసిన నేపథ్యంలో ప్రజా పాలన పేరుతో లబ్దిదారుల నుంచి ప్రజాలపాలన దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కాజీపేట, 62వ డివిజన్ సోమిడి కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి ప్రజా పాలన గ్యారంటీ స్కీం దరఖాస్తులను నాయిని రాజేందర్ రెడ్డి స్వీకరించారు. అనంతరం నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏ ఇబ్బందులు ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రతి సమస్యపై స్పందించేందుకు ప్రజలకు తాము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అర్హులైన దరఖాస్తులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఏ ఒక్కరూ ఆందోళన చెందే అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అది ఖచ్చితంగా చేస్తుందనీ, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తదని మాట ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సంతకం ఆరు గ్యారంటి స్కీంలపై చేశామన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డ రెండు రోజులకే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిందని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ని 5లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం జరిగిందని, మిగతావి 100రోజుల్లో పూర్తి చేస్తామని, కాబట్టి ప్రజలు ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగంచేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పోరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ, కాజీపేట తహశీల్దార్ భావుసింఘ్, మాజీ కార్పోరేటర్ గుంటి కుమార్, సుంచు అశోక్, టీపీసిసి కార్యదర్శి సయ్యద్ రజాలి, మహమ్మద్ అంకుష్, నాగపూరి లలిత, రంగు సుధీర్, బుర్ర బాబు రావు, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల ఆంజనేయులు, షేక్ అజ్గర్, పోగుల సంతోష్, కొండా శివ, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ కో–ఆర్డినేటర్ మోసేస్ పాల్ ఆనంద్ కుమార్ (ఎంపీ ఆనంద్), బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేయండి

## కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ లో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారందరిలో చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నారని, అర్హులైన వారందరినీ ఎంపిక చేయాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అధికారులను కోరారు. శనివారం రంగశాయిపేటలోని మహిళా స్వశక్తి భవన్ లోని ప్రజాపాలన కేంద్రంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ ఈ ప్రజా పాలన కార్యక్రమంలో సేవలందించిన అధికారులైన జీడబ్ల్యూఎంసీ, ఏసీపీ బషీర్, కరెంటు ఏఈ సంపత్ కుమార్, ప్రజా పాలన కేంద్రం ఇంచార్జి బిల్ కలెక్టర్ సునీతలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ 42వ డివిజన్ లో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్రం కోఆర్డినేటర్ బిల్ కలెక్టర్ సునీత, కరెంటు ఏఈ సంపత్ కుమార్, లైన్ ఇన్ స్పెక్టర్ కృష్ణ, స్థానిక పెద్దలు దామెరకొండ కరుణాకర్, ఇటికాల అశోక్, తాళ్లపల్లి అర్జున్, ఆరె కార్తీక్, భక్కి రంజిత్ కుమార్, మెప్మాకు చెందిన ఆర్పీలు కవిత, రమాదేవి, సురేఖ, భార్గవి, మహేశ్వరి, శ్రీకళ, అనిత, అంగన్వాడీ టీచర్లు హైమావతి, భార్గవి, రమాదేవి, యశోద, జ్యోతిరాణి, నాజీమా, అనిత, వినిత, ఆశావర్కర్లు లత, రమ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖకు హనుమాన్ నగర్ కాలనీ వాసుల వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శనివారం 33వ డివిజన్ హనుమాన్ నగర్ కాలనీ వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. హనుమాన్ నగర్ 33వ డివిజన్ లో రోడ్లు, వర్షానికి డ్రైనేజీ సమస్యలు బాగా ఇబ్బంది పడుతున్నామని, కాబట్టి నూతన రోడ్లు డ్రైనేజీలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ ఇండ్ల రవి, ముత్యాల విజయ్, శామంతుల శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో పాలకవర్గాలు అవలంబిస్తున్న ధనిక వర్గాల విధానాల వలన పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారిపోతున్నారని బీకేఎంయూ జాతీయ నాయకుడు మోతే లింగారెడ్డి పాలకులపై ధ్వజమెత్తారు. ఒక్క శాతంగా ఉన్నటువంటి పెట్టుబడిదారీ వర్గం 99శాతంగా ఉన్న కష్టజీవుల కష్టార్జితాన్ని దోచుకోవడం ద్వారానే సంపన్న వర్గాల సంపద విపరీతంగా పెరిగిపోతూ కార్మిక వర్గం కడుపేదరికంలోకి నెట్టబడుతుందని ఆయన అన్నారు. శనివారం హసన్ పర్తి మండలం పెగడపల్లి గ్రామంలో దోమ రాకేష్ అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ 99వ వార్షికోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన మోతిలింగారెడ్డి మాట్లాడుతూ శ్రమజీవుల కష్టజీవుల శ్రమ శక్తిని లాభాల పేరుతో దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా గౌతమీ ఆదాని ఎదిగాడని, డూమ్బర్గ్ మిలియన్ ఇయర్స్ రియల్ టైం ఇండెక్స్ ప్రకారం ఆదాని వ్యక్తిగత సంపద ఒక్కరోజే రూ.770కోట్ల డాలర్లు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీలకు జాతి సంపదను కాంట్రాక్టర్ల పేరుతో దోచిపెడుతుందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని బొందపెట్టి ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకిక వాదాన్ని, రిజర్వేషన్లను రక్షించుకొనుటకు ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి సీపీఐ సభ్యత్వాలను చేర్పించి, ఉద్యమాలను నిర్మించడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి చోదక శక్తిగా నిలబడాలని పిలుపునిచ్చారు. సీపీఐ 99వ వార్షికోత్సవం సభలో మధున రాజు కుమారస్వామి, జ్యోతి, వీరస్వామి, వెంకటలక్ష్మి, దీన, హనుమకొండజిల్లా సీపీఐ సమితిసభ్యులు నేదునూరు రాజమౌళి పాల్గొన్నారు.

## వీఐపీలకు కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఆహ్వానపత్రిక



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కొత్తకొండ వీరభద్రస్వామి జాతర బ్రహ్మోత్సవముల 2024 సందర్భంగా ఈ నెల 10 బుధవారం సాయంత్రం 6:20 నిమిషాలకు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీ వీరభద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికలను తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళి దంపతులకు, హనుమకొండ జిల్లా కలెక్టర్ సీక్తా పట్నాయక్, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, హనుమకొండ జడ్పీ చైర్ పర్సన్ మారేపల్లి సుధీర్ కుమార్ లకు శనివారం అందించి శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి పి.కిషన్ రావు, అర్చకులు శ్రీకాంత్, వీరభద్రయ్య, శివకుమార్, శరత్ చంద్ర, సిబ్బంది సంజీవరావు పాల్గొన్నారు.



## అయోధ్య అక్షింతల పంపిణీ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఖాదర్ పేట గ్రామంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను ప్రతి ఇంటి గడప గడపకు అత్యంత భక్తి శ్రద్ధలతో అన్ని వీధుల గుండా డోలు వాయిద్య చప్పుళ్లతో హనుమాన్ గ్రామ కమిటీ సభ్యులతో కలిసి పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దామరొప్పుల శేఖర్, కూస రవికుమార్, ఏలుగాల మల్లయ్య, నల్ల అశోక్, పెంతల బుచ్చిరెడ్డి, కూస రాజు, కొనుకటి నవీన్, సింగిరెడ్డి రవి, చెవ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ న్యాయం చేస్తాం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలోని గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి నెల్లుట్ల సుమన్ టీం ఆధ్వర్యంలో ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న నిరుపేద కుటుంబాల లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. దరఖాస్తులలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూస్తామన్నారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఫణి కుమార్, సర్పంచ్ కుండే మల్లయ్య, ఎంపీటీసీ కంది కృష్ణా రెడ్డి, కళాకారులు, టీం లీడర్ నెల్లుట్ల సుమన్, తాళ్ల సునీల్, యోచన, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగెల రవీందర్ పాల్గొన్నారు.

# అవయవ దానం అత్యున్నతమైన దానం

## జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అన్ని దానాల్లోకెల్లా అవయవ దానం అత్యున్నతమైనదని, మానవ జన్మకు మహా అవకాశమని, నేత్ర దానంతో అంధుల్లో వెలుగులు, అవయవదానంతో ఆరిపోయే ప్రాణాలకు ఆయుష్షును, దేహ దానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగ పడవచ్చునని, ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని హస్తినాపురి కాలనీలో తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం జిల్లా అధ్యక్షుడు పరకాల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అవయవ దాన కార్యక్రమంలో డా అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చనిపోయిన తర్వాత అవయవాలను కాల్చడం ద్వారా బూడిద పాలు, మట్టిలో పాతడం ద్వారా మట్టిపాలు చేయకుండా అవయవ దానం చేసి చిరంజీవులుగా మిగిలి పోవాలని కోరారు. భారతదేశంలో 12లక్షల మంది అంధులు ఇంతవరకు ప్రపంచాన్ని చూడలేక, నేత్ర దాతల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, బీసీ పొలిటికల్ ఫ్రంట్ వ్యవస్థాపకులు కొండ బత్తుల యాదగిరి, వారి శ్రీమతి వినోద కలిసి అవయవ దాన అంగీకార పత్రం డాక్టర్ అశోక్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, మాజీ కౌన్సిలర్ జన్నాయి కోడె శోభారాణి, హస్తినాపురి కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాపాల పాలన కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యుడు యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ప్రజాపాలన ముగింపు రోజు కావడంతో లబ్ధిదారులు తరలివచ్చి తమ దరఖాస్తులను అందజేశారు.

# ఈపాలి ఏట గురితప్పేదే లేదేస్

## తండేల్ ప్రచార వీడియో విడుదల



నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' సినిమా షూటింగ్ జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనికి చందూ మొండేటి దర్శకుడు, ఈ సినిమాని గీత ఆర్ట్స్ బ్యానర్ మీద అల్లు అరవింద్ సమర్పిస్తుండగా బన్నీ వాసు నిర్మిస్తున్నారు. చిత్ర నిర్వాహకులు ఈ సినిమా మొదటి ప్రచార వీడియో విడుదల చేశారు. నాగ చైతన్య సముద్రం మీదకి చేపలు పట్టడానికి వెళితే, తప్పిపోయి పాకిస్తాన్ దేశానికి వెళ్లి అక్కడ సైనికులకు దొరికిపోతాడు. అక్కడ పాకిస్తాన్ జైల్లో నాగ చైతన్య ఉంటే, ఇక్కడ అతని ప్రియురాలు సాయి పల్లవి సముద్రం ఇవతలి ఒడ్డున అతనికోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఈ ప్రచార చిత్రాలు ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా తీయడమే కాకుండా, అవి ఎంతో ఉన్నతమైన సాంకేతికతని కూడా వాడినట్టుగా స్పషంగా తెలుస్తోంది. ఎందుకంటే నాగ చైతన్య సముద్రంలోకి వెళ్లడం, పాకిస్తాన్ సైనికులకు దొరికిపోవడం ఇవన్నీ ఎంతో హృద్యంగా చిత్రీకరించారు. 'తండేల్' కథ నేపథ్యం శ్రీకాకుళం దగ్గర జరిగిన ఒక కథ ఆధారంగా తీసుకొని నిర్మిస్తున్నారు కాబట్టి, నాగ చైతన్య శ్రీకాకుళం యాస కూడా బాగానే మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు. 'దద్దా గుర్తెట్టుకో, ఈపాలి ఏట గురితప్పేదే లేదేస్. ఇక రాజులమ్మ జాతరే' అని మాటతో ప్రారంభం అవుతుంది. దేవి శ్రీ ప్రసాద్ నేపథ్య సంగీతం ఈ చిత్రాలకి మంచి తోడ్పాటు అందించటమే కాకుండా, ఆసక్తికరంగా ఉండేట్టు చేసింది.


# గుంటూరు కారం భలే క్రేజీ

అతడు, ఖలేజా చిత్రాల తర్వాత త్రివిక్రమ్-మహేశ్ బాబు కాంబినేషన్లో వస్తున్న చిత్రం 'గుంటూరు కారం' పై ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ చిత్రంలో లిరికల్ సాంగ్స్ లక్షల వ్యూస్‌తో యూట్యూబ్‌ను షేక్ చేస్తున్నాయి. ఇప్పుడు సినిమా ప్రీమియర్ షో విషయంలోను రికార్డు సృష్టించింది. 'గుంటూరు కారం' కోసం జనవరి 11న అమెరికాలో 5,408 ప్రీమియర్ షోలు వేయనున్నారు. తెలుగు సినిమాకు ఇన్ని షోలు వేయడం రికార్డని చిత్ర బృందం తెలిపింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మాత నాగవంశీ సినిమాపై మరోసారి ధీమా వ్యక్తం చేశారు. సినిమా అద్భుతంగా వచ్చిందనీ, తమన సంగీతం, బ్యాగ్రౌండ్ స్కోర్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుందని చెప్పారు. అయితే ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరగాల్సి ఉంది. కానీ సెక్యూరిటీ, పోలీసు అనుమతులు ఇతర కారణాలతో ఈవెంట్ వాయిదా పడింది. ఈ విషయంలో మాత్రం అభిమానులు రుత్సాహపడుతున్నారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి ఈ చిత్రంలో కథానాయికలుగా నటించారు.



# గీతాంజలి మళ్లీ వచ్చింది..

## ఫస్ట్ లుక్ విడుదల





టాలీవుడ్ హీరోయిన్ అంజలి టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం గీతాంజలి మళ్లీ వచ్చింది. 2014లో కామెడీ అండ్ హార్రర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'గీతాంజలి' సినిమాకు ఈ చిత్రం సీక్వెల్‌గా రాబోతుంది. ఇక ఈ సినిమాలో శ్రీనివాస్ రెడ్డి కథనాయకుడిగా నటిస్తుండగా.. సత్యం రాజేశ్, షకలక శంకర్, అలీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అంజలి 50వ సినిమాగా రానున్న ఈ చిత్రానికి కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లేను అందిస్తుండగా.. శివతుర్లపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే కొత్త సంవత్సరం కానుకగా మూవీ నుంచి అంజలి ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు హీరో సునీల్ ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో పాడుబడిన బిల్డింగ్‌లో అంజలి, శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేశ్, షకలక శంకర్, అలీ, సునీల్ ఉండగా.. పైకి దేనినో సీరియస్‌గా చూస్తున్నట్లు ఉంది. ఇక వీళ్ళందరూ ఎందుకు అలా చూస్తున్నారు అనేది తెలియాలంటే సినిమా రిలీజ్ వరకు వెయిట్ చేయాల్సిందే. ఎంవీవీ సినిమాస్ బ్యానర్‌తో కలిసి కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కోన వెంకట్ ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా.. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నాడు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



# సంక్రాంతి చుట్టూ సాగే కథ

నాగార్జున, అల్లరి నరేష్, రాజ్ తరుణ్ నటిస్తున్న 'నా సామిరంగ' సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో ఆషిక రంగనాథ్, రుస్కర్ ధిల్లాన్, మిర్న కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా నుండి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు ఇప్పటికే బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ సినిమాకి ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చుస్తున్నారు. ఈ సినిమాకి సుమారు రూ. 45 కోట్ల వరకు అయిందని పరిశ్రమలో టాక్ నడుస్తోంది. ఎందుకు ఈ సినిమా సంక్రాంతికి విడుదలవ్వాలని ఈ చిత్ర నిర్వాహకులు పట్టు పట్టారు అంటే, ఈ సినిమా కథా నేపథ్యం అటువంటిది అని అంటున్నారు. ఇకపోతే ఈ సినిమా కథ కొంచెం లీకయింది. ఈ సినిమా కథ మొత్తం మూడు రోజుల్లో జరిగే కథ అని అంటున్నారు. మధ్యలో ఫ్లాష్ బ్యాక్ సన్నివేశాలు తప్పితే ఈ సినిమా కథ భోగి నాడు మొదలై కనుమ నాడు ముగుస్తుంది అని అంటున్నారు. అందుకే ఇది సంక్రాంతి పండగ నేపథ్యం వున్న కథ అని అందుకే సంక్రాంతికి విడుదలైతేనే బాగుంటుందని చిత్ర నిర్వాహకులు రాత్రి పగలు పని చేసి సినిమాని పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. భోగి నాడు ఏమి జరిగింది, దానివల్ల ఎదురయ్యే సంఘటనలు ఏంటి, మళ్ళీ కనుమ నాడు ఈ కథ ఎలా పూర్తయింది అనేదే సినిమా అని అంటున్నారు.

# మాది గడీల పాలన కాదు.. గల్లీ బిడ్డల పాలన

**ప్రజా పాలనలో తీసుకున్న ప్రతీ దరఖాస్తు డేటా ఎంట్రీ చేస్తాం**

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం**

**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**



**వరంగల్ వాయిస్, ములుగు :** మాది గడీల పాలన కాదు..గల్లీ బిడ్డల పాలన అంటూ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రకటించారు. ప్రజా పాలనలో తీసుకున్న ప్రతి దరఖాస్తు డేటా ఎంట్రీ చేస్తామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వెల్లడించారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మా ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న మద్దతు చూసి బీఆర్ ఎస్ నేతలు భయపడి మాపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం లేకుండా వారు బతకలేకపోతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఫ్యూడల్ పార్టీ అంటూ దుయ్యబట్టారు. ఏకకాలంలో రుణమాఫీ అన్నారు? ఏమైందంటూ ప్రశ్నించారు. పదేండ్లు దోచుకున్న దోపిడీ దొంగలు వారన్నారు. 420 దొంగలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ ప్రజాస్వామికంగా ఏర్పాటైన మా ప్రభుత్వాన్ని కూల్చేస్తాం, పేల్చేస్తామంటూ ప్రకటిస్తున్నారని మండిపడ్డారు. ఆటో వారిని రెచ్చగొట్టి నిరసనలు చేయిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు దొచుకున్నదంతా బయటకి వస్తోందన్నారు. బంగారు తెలంగాణ పేరు చెప్పి అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జిల్లా ఎస్పీ డాక్టర్ శభరిష్, డీఎస్పీ రవీందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల గ్రామ, నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### జర్నలిస్టులకు అండగా ఉంటాం..

జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క ప్రకటించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు అధ్యక్షులు షఫీ అహ్మద్, బేతి సతీష్, ఓద్దుల మురళి, పాల్గొండ రమేష్, సీహెచ్ రమేష్, వెంకటేష్, రాజు, శంకర్, కుమార్, జర్నలిస్టులందరూ పాల్గొన్నారు.

### మేడారం భక్తులకు సకల సౌకర్యాలు..

మేడారం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం మేడారం పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆమె జాతరకు ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించిందని, ఈ నిధులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రహదారులు, తాగునీరు, మరుగుదొడ్లు, బాత్రూంలు ఇలా ప్రతి సౌకర్యం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, ఆర్డీఓ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అంకితభావంతో పనిచేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్టీసీ హనుమకొండ డిపోలో వన భోజనం మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. హనుమకొండ డిపో మేనేజర్ భుక్యా ధరంసింగ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్ కుమార్ హాజరై డిపో ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తూ 100శాతం ఆదాయం సమకూర్చేలా కృషి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆదాయం గణనీయంగా పెరగడంతో పాటు పని భారం కూడా పెరిగిందన్నారు. దీనికి కృషి చేస్తున్న ప్రతి ఉద్యోగిని ఆయన అభినందించారు. సమష్టి కృషితో రానున్న మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఉద్యోగుల మానసికోల్లాసానికి వనభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో సుదూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు బస్సుల్లో వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా డిపోలో నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు మాధవరావు, ఎం.భానుకిరణ్, డిపో మేనేజర్లు వి.మోహన్ రావు, జి.సురేష్ కుమార్, ఈఈ భాస్కర్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ నజియా సుల్తానా, మెకానికల్ సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్, ఆఫీస్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ట్రాఫిక్ సూపరింటెండెంట్లు పులి సదానందం, ఎ.రవీందర్, ఉద్యోగులు పబ్బాల వెంకటేశ్వర్లు, కేవి రెడ్డి, చారి, రమేష్, ఎస్ కేవై పాషా, పాపారావు, సజ్జన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రజా పాలన




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 27 డివిజన్ లో అధికారులతో కలిసి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ 27వ డివిజన్ లో పేద మధ్యతరగతి ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చి దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మాత్యులు కొండ సురేఖ మురలీధర్ రావు నాయకత్వంలో ప్రతి డివిజన్ లో ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ భాషపాక సదానందం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనివాస్, గుల్లపల్లి రామకృష్ణ, యువజన కాంగ్రెస్ వరంగల్ తూర్పు ఉపాధ్యక్షులు ఎర్రం కమల్, కాంగ్రెస్ నాయకులు పూలే పాక విశాల్ బాబు, సర్దార్ జస్వీర్ సింగ్, కోగీల యాకుబ్, కట్కూరి అన్వేష్, కొండమీది సదానందం, ఎర్రం లక్ష్మణ్, కోగిల యాకూబ్, ఎర్రం మణిదీప్, చిన్న, పెల్లి విజయ్, మంద కిరణ్, పాలేపక అరుణ్, నవదీప్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, జహీరా, గూడ లావణ్య, ఇనుముల విజయ, అధికారులు, వార్డు ఇన్చార్జ్ వాస్కుల రాజు, ఆర్పీలు, అధికారులు పాల్గొన్నారు.

# బాలికల సాధికారతే లక్ష్యం

**సేవా భారతి ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం**

**ఫిబ్రవరి 11న రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజ సంక్షేమానికి అంకితమైన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ, సేవా భారతి తన వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' 8వ ఎడిషన్ ను ఫిబ్రవరి 11, 2024 ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నట్లు సేవాభారతి అధ్యక్షులు డి.దుర్గారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉషా అయ్యర్ తెలిపారు. ఇటీవల జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఆదాయాన్ని సేవాభారతి కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ లోని మురికివాడల్లోని ఆడపిల్లల అభ్యున్నతికి కృషి చేయబోతున్నట్లు తెలిపారు. కిశోరి వికాస్ యోజన ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 10,236 మంది బాలికలకు సాధికారత కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2030 నాటికి లక్ష మంది ఆడపిల్లల భవిష్యత్ ప్రణాళికల ద్వారా సాధికారత లభించాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం అన్నారు. ఈ రన్ కు ఫ్రీడమ్ ఆయిల్, గ్లోబల్ డేటా, ఇన్ఫోసిస్, జీఈపీ, హెల్త్ ఎడ్జ్, యశోద హాస్పిటల్స్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్, బీడీఎల్, మిథాని వంటి కార్పొరేట్ సంస్థలు సహకరిస్తున్నాయన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల ద్వారా రాబోయే "రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్" కార్యక్రమంలో పాల్గొనాలని దాతలను కోరారు. నిరుపేద ఆడపిల్లల భవిష్యత్ ను మార్చే లక్ష్యానికి సేవాభారతి కట్టుబడి ఉందని, మా లక్ష్యానికి 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' కార్యక్రమం నిదర్శనమన్నారు. అలాగే 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' కార్యక్రమానికి దాతలు, రన్నర్లు అధికారిక వెబ్సైట్: www.runforagirlchild.org ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సేవాభారతి సభ్యులు పిలుపునిచ్చారు. ఆసక్తిగల వారు మరిన్ని వివరాలకు శ్రీనివాస్ తాడూరి 96180 36965 నంబరులో సంప్రదించాలన్నారు.

# కేయూలో కొనసాగుతున్న నిరసనలు

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా**




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ అక్రమాలకు అడ్డగా మారిందని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కేయూ ఫస్ట్ గేట్ ముందు ధర్నా నిర్వహించారు. కేయూ అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ల పదోన్నతుల అక్రమాలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. రానున్న బడ్జెట్ల లో రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన కేయూ భూములను స్వాధీనం చేసుకొని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీస్ ఇంచార్జి రెహమాన్, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ మాట్లాడుతూ గతంలో కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపక నియామక పోస్టుల్లో అనేక అక్రమాలు జరిగాయన్నారు. పీహెచ్డీ, అడ్మినిస్ట్రేషన్, మేస్ ఎగ్జామినేషన్.. ఏ ఒక్కటి యూనివర్సిటీలో సక్రమంగా నిర్వహించ లేదన్నారు. ప్రతి అంశంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుంటే గత ప్రభుత్వం చోద్యం చూసిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా వెంటనే చర్యలు తీసుకొని యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్ యాదవ్, జిల్లా సమితి సభ్యులు కుశాల్, నాయకులు జ్యోతిక, అమూల్య, అజార్, కుమార్, రమేష్, ఎన్ హేమంత్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com